# కుళ్లుతున్న ఉల్లి.. కూలుతున్న ఆశలు

కర్నూలు : సకాలంలో కొనుగోళ్లు చేపట్టక 'ఉల్లి' కుళ్లిపోతోం ది.. రోజువారీ వ్యాపారాలు జరగకపోవడంతో తరుగు పేరుతో 5- 10 క్వింటాళ్ల సరకు పారబోయాల్సి వస్తోంది. ఉమ్మడి కర్నూలు, తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా నుంచి నిత్యం వేలాది క్వింటాళ్ల ఉల్లి కర్నూలు విపణికి వస్తోంది. ఉల్లికి కుళ్లిపోయే గుణం ఎక్కువ.. ఎప్పటికప్పుడు గ్రేడింగ్ (మంచి గడ్డలు వేరు చేయడం) చేయాలి.. అలా చేస్తే వ్యాపారులు కొనుగోలు చేస్తారు.. గ్రేడింగ్ చేయించుకోవడానికి అ'ధనం'గా ఖర్చు చేయాల్సి వస్తోంది.. సరకు అమ్ముకోవడానికి మార్కెట్‌కు వచ్చిన ఏ ఒక్కరైతును కదిలించినా కష్టాలు కళ్లవెంట పొరలు పొరలుగా రాలుతున్నాయి..

గుట్టలుగా నిల్వలు

కర్నూలు వ్యవసాయ విపణిలో ఉల్లి నిల్వలు గుట్టలుగా పేరుకుపోయా యి. వ్యాపారులు కొనుగోలు చేసిన సరకు మార్కెట్ నుంచి బయటకు తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కర్నూలు నుంచి కోల్‌కతా, తమిళనాడు, కేరళ, కటక్, గుజరాత్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. లారీలు దొరక్కపోవడంతో లోడింగ్‌లో జాప్యం జరుగుతోందని వ్యాపారులు పేర్కొంటున్నారు. దీంతో వివిధ షెడ్లలో కలిపి సుమారు నాలుగు వేల టన్నుల మేర పేరుకుపోయినట్లు తెలుస్తోంది. మంత్రి, అధికారులు ఆదేశించినా దిగుబడులు బయటకు వెళ్లడం లేదు. ఆదివారం సెలవు కావడంతో మార్కెట్ కమిటీ అధికారులు పత్తా లేకుండా పోయారు.

దళారులదే రాజ్యం

మార్కెట్‌లో దళారులు రాజ్యమేలుతున్నారు. రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి.. మార్కెట్‌లోనే గ్రేడింగ్ చేసుకొని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మార్కెట్‌లోకి దళారులు అనుమతి లేని వ్యాపారులను రానీయకుండా అడ్డుకట్ట వేయాల్సి ఉండగా అధికారులు పట్టించుకో వడం లేదు. రైతులకు నష్టం జరుగుతున్నా.. మార్కెట్ ఆదాయానికి గండిపడుతున్నా.. అధికారులు నోరు మెదపడం లేదు. మార్కెట్‌కు ఆదాయం రాకున్నా పర్వాలేదు. దళారులు, వ్యాపారులకు మేలు జరిగితే చాలన్నట్లున్న వ్యవహరిస్తునారన్న ఆరోపణలున్నాయి.

అనధికారిక వ్యాపారాలు

మార్కెట్‌కు సెలవు.. పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరగవు. కానీ అనధికారిక వ్యాపారాలు జోరుగా సాగాయి. ఆర్ఆర్ ఆగ్రోటెక్ కమీషన్ ఏజెంట్ దుకాణానికి వెల్దుర్తి మండలానికి చెందిన రాము గురువారం ఉల్లిని తెచ్చారు. శుక్రవారం కొనుగోళ్లు నిలిచిపోయాయి. శనివారం క్రయవిక్రయాలు జరిగినా సదరు రైతు ఉల్లిని వ్యాపారులు కొనుగోలు చేయలేదు. ఆదివారం సదరు రైతు గ్రేడింగ్ చేయించగా 8 క్వింటాళ్ల ఉల్లి పారబోశారు. ఆర్ఆర్ ఆగ్రోటెక్ కమీషన్ ఏజెంట్ ఓ వ్యాపారితో మాట్లాడి క్వింటా రూ.1,520 ధర నిర్ణయించారు. ఆదివారం జంబో షెడ్డులో యథేచ్ఛగా అనధికారిక వ్యాపారం జరిగింది. అయినా మార్కెటింగ్ శాఖ అధికారులు పత్తా లేరు. కూరగాయల మార్కెట్‌లోని ఉల్లి షెడ్లలో చెన్నారెడ్డి అనే వ్యాపారి ఓ రైతు నుంచి అనధికారికంగా ధర నిర్ణయించి కొనుగోలు చేశారు.

8 క్వింటాళ్లు కుళ్లిపోయింది



– రాము, నరసాపురం, వెల్దుర్తి

రూ.40 వేలు వెచ్చించి బోరు కింద అర ఎకరాలో ఉల్లి సాగు చేశా.. దిగుబడి అంతంత మాత్రంగానే వచ్చింది. అమ్మేందుకు ఈనెల 24న కర్నూలు మార్కెట్‌కు 60 ప్యాకెట్లు తీసుకొచ్చా. శుక్రవారం కొనుగోళ్లు చేయలేదు.. జరిగినా నా సరకు తీసుకోలేదు. మూడు రోజులవు తుండటంతో సరకు కుళ్లిపోతోంది. కూలీలకు రూ.1,000 ఇచ్చి గ్రేడింగ్ చేయించా. 20 ప్యాకెట్ల (సుమారు 8 క్వింటాళ్లు) ఉల్లిని పారబోశా. 40 ప్యాకెట్లు మిగిలాయి.. 8 క్వింటాళ్ల సరకుకు సంబంధించి రూ.20 వేల వరకు నష్టం వచ్చింది.

4 క్వింటాళ్లు పారబోశా

–అయ్యన్న, చిన్నకొట్టాల

రూ.లక్ష వెచ్చించి 1.50 ఎకరాల్లో ఉల్లి సాగు చేస్తే 52 ప్యాకెట్ల దిగుబడులొచ్చాయి. నాలుగు రోజుల కిందట మార్కెట్‌కు సరకు తీసుకొచ్చా. అప్పటినుంచి పడిగాపులు కాస్తూనే ఉన్నా. సరకు దెబ్బతింటుండటంతో ఒక్కో కూలీకి రూ.500 చొప్పున ముగ్గురిని ఏర్పాటుచేసి రూ.1,500 చెల్లించి గ్రేడింగ్ చేయించా. సుమారు 4 క్వింటాళ్ల ఉల్లి పారబోయాల్సి వచ్చింది.

రూ.15 వేల నష్టం– కోదండరాముడు, మల్కాపురం, డోన్1.25 ఎకరాల్లో రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టా. క్వింటా రూ.3,300 చొప్పున 60 క్వింటాళు పొలంలోనే అమ్మేశా. మిగిలిన 35 ప్యాకెట్ల సరకును కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో అమ్ముకుందా మని వస్తే క్వింటా రూ.1,350 పలికింది. మార్కెట్‌లో వ్యాపారులు సిండికేటై నిలువునా ముంచుతున్నారు. క్వింటా రూ.1,350 ధర రాస్తే అమ్మలేదు. కూలీలకు రూ.1,600 చెల్లించి ఆదివారం గ్రేడింగ్ చేయించా. 3 క్వింటాళ్ల ఉల్లిని పారబోశా. క్వింటా రూ.3 వేల చొప్పున రూ.9 వేలు నష్టం వాటిల్లింది. పాత మార్కెట్ నుంచి మాధవారి షెడ్లల్లోకి సరకు తీసుకొచ్చేందుకు మరో రూ.600 రవాణా ఖర్చులు, మార్కెట్‌లో నాలుగు రోజులు ఉండటంతో రూ.2 వేలు ఖర్చైంది. మొత్తంమీద రూ.15 వేల వరకు నష్టం వాటిల్లింది. 35 ప్యాకెట్ల ఉల్లిని అమ్ముకునేందుకు రూ.15 వేలు ఖర్చు చేయాల్సి వచ్చింది

# మహిళలకు ఆర్థిక చేయూత

మయూరికూడలి : పొదుపు సంఘాల సభ్యులను ఆర్థికంగా ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల కిందట పీఎంఎఫ్‌ఎంఈ(ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్) పథకాన్ని తీసుకొచ్చింది. ఇందులో భాగంగా పెద్దఎత్తున మహిళలు లబ్ధిదారులుగా చేరి, యూనిట్లు ఏర్పాటు చేసుకున్నారు. ఇలాంటి వారితో పాటు కొత్తగా చేరే సభ్యులకు జీవనోపాధుల కింద మరింత చేయూత అందించేందుకు కూటమి ప్రభుత్వం ముందుకొచ్చింది. యూనిట్ ఖరీదుతో సంబంధం లేకుండా స్త్రీనిధి నుంచి భారీగా నిధులు కేటాయించనుంది. ఒక్కొక్కరికీ రూ.40 వేల వరకు దక్కనున్నట్లు తెలుస్తోంది.

రూ.40 కోట్లు..ఇప్పటికే యూనిట్ ఏర్పాటు చేసి, వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నవారిని నేరుగా ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు 2024- 25 ఆర్థిక ఏడాదికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి రూ.40 కోట్ల వరకు విడుదల చేయనున్నారు. గతంలో సెర్ప్‌కు ఇచ్చేవారు. తద్వారా సమాఖ్యల నుంచి పొదుపు సభ్యులకు చేరేవి. వారు నెలనెలా వాయిదాల రూపంలో చెల్లింపులు చేసేశారు. ఈ ఏడాది నుంచి స్త్రీనిధి ద్వారా ఆరు శాతం వడ్డీతో ఇచ్చేందుకు కూటమి నిర్ణయించింది. 24 నెలల్లో తిరిగి బ్యాంకులకు కట్టాలి.

ఎంపిక పూర్తి..ఉమ్మడి జిల్లాలో పీఎంఎఫ్‌ఎంఈ పథకం కింద గత రెండేళ్ల నుంచి సుమారు 3125 మంది చేరారు. చేగోడీలు, పచ్చళ్లు, వేరుసెనగతో వివిధ రకాల ఆహార పదార్థాలు, బిస్కెట్లు, మామిడి తాండ్ర తదితర యూనిట్లు ఏర్పాటు చేసుకున్నారు. వీరిలో ఇప్పటికే కొంతమందికి సమాఖ్యల ద్వారా రూ.40 వేలు అందించారు. అయితే కొందరికి ఇవ్వలేదు. అలాంటి వారితో పాటు కొత్తగా చేరిన వారిలో అర్హులుగా 725 మందిని గుర్తించారు. సంబంధిత జాబితాను ప్రభుత్వానికి పంపించామని, అనుమతులు వచ్చాక రుణాలు అందిస్తామని డీఆర్డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి తెలిపారు.

# శివయ్యా.. కనవయ్యా..!



మార్టేరు : కార్తిక మాసం వచ్చిందంటే ఉమ్మడి పశ్చిమ గోదావరి పర్యాటకులు, భక్తులతో సందడిగా మారుతుంది. వేకువజామునే నదులు, కాలువల్లో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకోవడంతోపాటు ఆధ్యాత్మిక భావనలో గడుపుతారు. అందుకే ఈ నెల రోజులూ శైవక్షేత్రాలన్నీ కిటకిటలాడుతూ శివనామస్మరణతో మార్మోగుతాయి. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ క్షేత్రాలు, రేవుల్లో పరిస్థితిపై పరిశీలన చేసింది.

పసర్లమయం.. ఆచంట రామగుండం

ఆచంట శ్రీరామేశ్వరస్వామి దేవస్థానం స్నానాల రేవులో నీరు పసర్లమయంగా మారాయి. గతంలో విశాలంగా ఉన్న రామగుండాన్ని అధిక విస్తీర్ణంలో తాగునీటి చెరువుగా అభివృద్ధి చేశారు. ఉన్న కొద్దిపాటి రేవులోనే భక్తులు స్నానమాచరిస్తున్నారు. దేవస్థానానికి వచ్చే ప్రధాన మార్గంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దర్శనానికి వచ్చే భక్తుల వాహనాల నిలిపేందుకు ప్రత్యేక స్థలం లేదు.

సౌకర్యాల మాటే మరిచారు...

పెనుగొండ మండలం సిద్ధాంతంలోని మూడు పుష్కర రేవులు ఘోరంగా దర్శనమిస్తున్నాయి. గోదావరిలో నిమజ్జనం చేసిన వినాయక విగ్రహాలు, ఇతర వ్యర్థాలతో ఈ రేవుల వద్ద నదిలోకి దిగే అవకాశం లేకుండా పోయింది. ప్రస్తుతం ఉన్న దుస్తులు మార్చుకునే గది పాడయ్యింది. మరుగుదొడ్ల వైపు వెళ్లాలంటే భయపడే పరిస్థితి. ప్రస్తుతం రేవుల్లో ఎటువంటి రక్షణ చర్యలు లేవు.

పాలకొల్లులో ఏటా కష్టాలే..

పాలకొలు క్షీరారామలింగేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులకు సౌకర్యాల కల్పనలో ఏటా లోపం కనిపిస్తోంది. వీఐపీల తాకిడితో సామాన్యులకు దర్శనం కష్టతరంగా మారుతుంది. దేవాదాయ శాఖ సత్రాలు ఉన్నా దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు బస చేసే అవకాశం లేదు. అభిషేకాలు చేయించుకోవాలంటే మరుగుదొడ్లు దాటుకుని ఆ మండపానికి చేరుకోవాలి. ఆలయ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతోంది.

అధ్వానంగా రేవులు.. ఆచంట మండలంలోని గోదావరి తీర ప్రాంతంలో పెద్దమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, అయోధ్యలంక, భీమలాపురం గ్రామాల్లో ఉన్న రేవులు అధ్వానంగా ఉన్నాయి. కరుగోరుమిల్లి రేవు వరదల సమయంలో కొట్టుకుపోయింది. పెద్దమల్లం, కోడేరు రేవులు మట్టితో నిండాయి. ఈ రేవుల్లో మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక వసతులు కల్పించకపోవడంతో ఏటా అవస్థలు పడుతున్నారు.

ప్రదక్షిణలకు అగచాట్లే

కొద్దిపాటి వర్షానికే గోస్తనీ డ్రెయిన్ పొంగి నత్తారామేశ్వరంలోని రామేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోకి నీరు వస్తోంది. త్రిలింగ క్షేత్రంగా గుర్తింపు పొందిన ఇక్కడికి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. గోస్తనీ నీరు కారణంగా ప్రదక్షిణలు చేసేందుకు వీలు పడటం లేదు.

పొంచి ఉన్న ప్రమాదం

నరసాపురం గోదావరిలో ఉన్న మూడు ప్రధాన రేవుల్లో టైల్స్ పాడవడంతో భక్తులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. విద్యుత్తు దీపాలు కొంతమేర ఉన్నా మరిన్నీ ఏర్పాటు చేయాల్సి ఉంది. రక్షణ వలయాలను సైతం ఏర్పాటు చేయాల్సి ఉంది.

# వరిని మింగిన ఆక్వా..!




భీమవరం : వ్యవసాయ రంగాన్ని నమ్ముకుని జీవిస్తూ.. దేశానికి అన్నం పెడుతున్న అన్నదాతలు ఏటా నాగలికి దూరమవుతున్నారు. పంటల సాగు విస్తీర్ణం, దిగుబడులు తగ్గుతుండటం దీనికి నిదర్శనం. రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడులు వస్తున్నాయంటూ అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో కానరాని పరిస్థితి నెలకొంది. రెండేళ్లలో ఖరీఫ్ సీజన్ సాగు గణాంకాలను పరిశీలిస్తే ఆందోళన కలిగిస్తోంది. గతేడాదితో పోలిస్తే ఖరీఫ్‌లో 5,803, మొత్తంగా చూస్తే 34 వేల ఎకరాల్లో తగ్గుదల కనిపిస్తోంది.

గత వైకాపా సర్కారు కాలువల నిర్వహణ గాలికొదిలేయడంతో శివారు పొలాలకు నీరందలేదు. ఉండి, తణుకు సబ్ డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో, పాలకోడేరు మండలం మైప, మోగల్లు గ్రామాల రైతులు సాగునీటి కోసం నిరసనలు తెలిపారు. ఎరువుల ధరలు పెరగడం, టార్పాలిన్లు, రాయితీ యంత్రాలు అందక... నారుమడులు వేయడం మొదలు పంటనమ్మి నగదు చేతిలో పడే వరకు వైకాపా ప్రభుత్వం రైతులను ముప్పుతిప్పలు పెట్టింది.

వాతావరణ మార్పులతో..

వాతావరణ మార్పులు సైతం రైతులకు కునుకు లేకుండా చేశాయి. గత ఏడాది నవంబరులో కురిసిన వర్షాలకు జిల్లాలో 23,661 హెక్టార్లలో వరి పంటకు నష్టం వాటిల్లింది. ఈ ఏడాది జులైలో కురిసిన వర్షాలకు తాడేపల్లిగూడెం, ఉండి, దువ్వ, తణుకు ఇతర ప్రాంతాల్లో చేలు ముంపు బారిన పడ్డాయి. సెప్టెంబరులో కురిసిన వర్షాలకు 8,758 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది.

స్థిరాస్తి వెంచర్లుగా..

వ్యవసాయ భూములను అనుమతులు తీసుకోకుండానే ఇతర అవసరాలకు మార్చేస్తున్నారు. దీంతో పచ్చని పొలాలు స్థిరాస్తి వెంచర్లు, చేపలు, రొయ్యల చెరువులుగా మారిపోతున్నాయి. స్థిరాస్తి వ్యాపారులు పచ్చని పొలాలను కొనుగోలు చేసి అనుమతులు లేకుండానే వెంచర్లుగా మార్చేస్తున్నారు. ఆ భూముల పక్కనున్న రైతుల భూములు చిన్న కమతాలుగా మారిపోవడంతో అయినకాడికి అమ్మేస్తున్నారు.

భీమవరం మండలంలో ఖరీఫ్‌లో 9,198 ఎకరాల్లో వరి సాగు లక్ష్యం కాగా గతేడాది 5,983 ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది 3,462 ఎకరాలకే పరిమితమైంది.

పెంటపాడు మండలంలో ఖరీఫ్‌లో 22,361 ఎకరాల లక్ష్యానికి గతేడాది 21,064 ఎకరాల్లో సాగుచేస్తే ఈ ఏడాది 20,356 ఎకరాలకు తగ్గింది.

నరసాపురం మండలంలో ఖరీఫ్‌లో 8,321 ఎకరాల లక్ష్యానికి గతేడాది 6,059 ఎకరాల్లో సాగుచేస్తే ఈ ఏడాది 3,612 ఎకరాలకు పరిమితమైంది.

గతంలో 25 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేసేవాణ్ని. సాగు ఖర్చులు పెరగడం, నీరందకపోవడంతో పదెకరాలకు మాత్రమే పరిమితమయ్యానని రైతు వెంకటేశ్వరరావు తెలిపారు.

ఎకరాకు రూ.40 వేలకు పైగా పెట్టుబడి పెట్టినా ప్రకృతి విపత్తులతో ఏటా నష్టపోతూనే ఉన్నామని, అందుకే కొంత భూమి అమ్మేసినట్లు యలమంచిలికి చెందిన రైతు వాపోయారు.పొలాల మధ్య చెరువులు.. ఒకప్పుడు ఊరికి దూరంగా ఉన్న ఆక్వా చెరువులు రెండు పంటలు పుష్కలంగా పండే గ్రామాల్లోకి చేరడంతో వరి సాగు తగ్గిపోయింది. అనుమతులు లేకుండానే పొలాల మధ్య రొయ్యలు, చేపల చెరువులు తవ్వేస్తున్నారు. "ప్రధానంగా మురుగు కాలువల వ్యవస్థ అధ్వానంగా మారడం, ముంపు ఇబ్బందులతో సాగుకు దూరమవుతున్నారు. రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం." అని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు అన్నారు.

# ఆధార్ తప్పులు.. అపార కష్టాలు

నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి జీవితకాల గుర్తింపు సంఖ్యతో కార్డు జారీ చేయాలని మూడేళ్ల కిందటే కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) పేరుతో 12 అంకెల సంఖ్యతో కార్డు జారీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. విద్యార్థుల అకడమిక్ పురోగతిని అంచనా వేయడానికి ఇది ఉపయోగపడుతుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వీటిని జారీ చేయాలని నిర్ణయించారు. రెండు జిల్లాల పరిధిలో 4,21,374 మంది విద్యార్థులకు పంపిణీ చేయాల్సి ఉంది.70 శాతం వివరాల్లో తేడాలుఅపార్ కార్డుల జారీకి కష్టాలు తప్పడం లేదు. కార్డుల జారీ బాధ్యతను ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు. లక్ష్యం మేరకు కార్డులు జారీ చేయకపోతే తాఖీదులు ఇస్తామని విద్యాశాఖ అధికారులు ఇప్పటికే హుకుం జారీ చేశారు. చాలా మంది విద్యార్థుల వివరాలు పాఠశాల దస్త్రాల్లో ఒక రకంగా.. ఆధార్ కార్డుల్లో మరో రకంగా ఉన్నాయి. చాలా పాఠశాలల్లో 30 శాతం వివరాలే దస్త్రాలు, ఆధార్ కార్డులతో సరిపోతున్నాయి. ఆధార్ నమోదులోనే ఎక్కువగా తప్పులుంటున్నాయి. ఒకసారి అపార్ కార్డు ఇస్తే విద్యార్థి చదువు పూర్తయ్యే వరకు ఇదే నంబరు ఉంటుంది.తప్పులు సవరించుకుంటేనే7–8 ఏళ్ల కిందట ఆధార్ తీసుకున్న వారి వివరాల్లో పెద్దఎత్తున తప్పులు ఉన్నాయి. ప్రస్తుతం అపార్ కార్డును ప్రాధాన్యతాంశంగా పరిగణించాలని చెబుతున్నారు. దీంతో ఆధార్‌లోని తప్పులను సరిచేసుకోవాల్సి ఉంది. ఇందుకోసం ఆధార్ కేంద్రాలకు వెళ్లాలి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు లేవు. దీంతో తల్లిదండ్రులు విద్యార్థులను పక్క గ్రామాలకు తీసుకెళ్లి ఆధార్‌లో తప్పులను సవరించుకోవాల్సి వస్తోంది. వ్యవసాయ పనుల కారణంగా చాలామంది ఇందుకోసం సమయం వెచ్చించలేకపోతున్నారు.ఇలా చేస్తే మేలుపుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లను అడ్మిషన్ రిజిస్టర్ ప్రకారం ప్రధానోపాధ్యాయులు యూడైస్‌లో మార్చవచ్చు.స్కూల్‌లో అడ్మిషన్ రిజిస్టర్ ప్రకారం ప్రధానోపాధ్యాయులు సర్టిఫికెట్ ఇస్తే ఈ వివరాల ప్రకారం ఆధార్ కేంద్రాల్లో మార్చేలా ఉన్నతాధికారులు తీసుకోవాలి.

# నీళ్లు దాచమంటే నిధులు దోచారు

ఎమ్మిగనూరు : కరవు నేలలో రాలిన వర్షపు చినుకులను ఒడిసి పట్టి భూగర్భ జలాలు పెంపొందించాలని కేంద్రం నిర్ణయించింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు పెత్తనం చేసి పథకాలను 'నీరు'గార్చారు. రూ.కోట్లు నీళ్లలా ఖర్చు అయ్యాయే తప్ప పథకాన్ని అమలు చేస్తున్న గ్రామాల్లో చుక్కనీటిని ఒడిసి పట్టలేదు. ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన (పీఎంకేఎస్‌వై)–2.0 కింద 2021లో నీటి నిల్వ పనులకు శ్రీకారం చుట్టారు. నీటిని సంరక్షించి పొలాలకు మళ్లించడం, భూగర్భ జలాలు పెంపొందించడం.. భూమి కోతకు గురికాకుండా చేయడం పథక ఉద్దేశం. హాలహర్వి, ఎమ్మిగనూరు, ఆదోని, ఓర్వకల్లు, కృష్ణగిరి మండలాల్లోని 17 గ్రామాల్లో వివిధ పనులు ప్రారంభించారు. రూ.53.40 కోట్లతో చెక్‌డ్యాంలు, చెక్‌వాల్స్, రాక్‌ఫిల్ డ్యాంలు, ఊట చెరువులు, పంటకుంటలు, ఇంకుడు గుంతలు వంటి పనులు చేపట్టాలని నిర్ణయించారు. వీటిని 2025 సంవత్సరంలోపు పూర్తి చేసి 24,276 ఎకరాలకు సాగునీరందించాలని ప్రణాళిక రూపొందించారు. ఇప్పటి వరకు రూ.30 కోట్ల వరకు ఖర్చు పెట్టినా చుక్క నీరు నిల్వ చేయలేకపోయారు.

కనిపించని బోర్డులు

నీటి కుంటలు, డకౌట్, చెక్‌డ్యాంల నిర్మాణాల వద్ద ఎంత నిధులు ఖర్చు చేసింది, ఎంత మేర తవ్వింది, అంచనా విలువ తదితర వివరాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంది. చెక్‌డ్యాంల వద్ద బోర్డు రాయగా, నీటి కుంటలు వద్ద చాలా వరకు ఏర్పాటు



చేయలేదు. పనులనూ ఇష్టానుసారంగా చేపట్టారు.

వైకాపా నేతల పెత్తనం ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన పనులు వాటర్ షెడ్ కమిటీల పర్యవేక్షణలో చేపట్టాలి. కమిటీల్లోని సభ్యులంతా వైకాపాకు చెందినవారే. వారి ఆధ్వర్యంలోనే పనులు చేపట్టారు. పనులన్నీ నాసిరకంగా ఉన్నాయి. మరికొన్నిచోట్ల పూర్తి కావాల్సి ఉంది. నిధులు విడుదల చేయకపోవడంతో గతేడాది నుంచి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఎక్కడ అక్రమాలు బయటపడతాయోనని భయపడి 'కూటమి' ప్రభుత్వం అధికారంలోకి రాగానే 20 శాతం మంది స్వచ్ఛందంగా తప్పుకొన్నారు. మిగిలిన 80 శాతం మంది పనితీరు సరిగా లేకపోవడంతో అధికారులే తొలగించారు. పనులు పూర్తి చేయడానికి ఇంకా ఒక్క సంవత్సరం మిగిలి ఉంది. కొత్త ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది.

నాణ్యత నీరుగారింది ఎమ్మిగనూరు మండలం కందనాతి, కడివెళ్లలో 2,219 హెక్టార్లలో వాటర్ షెడ్ల నిర్మాణం, నీటికుంటలు, డకౌట్లు, పొలాల నుంచి మట్టి కొట్టుకుని పోకుండా రాతికట్టలు వంటి నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఇప్పటి వరకు చెక్‌డ్యాంలు, ఫారం పాండ్స్, నీటి కుంటలు తవ్వడం వంటి పనులకు రూ.1.18 కోట్ల ఖర్చు చేశారు.కడివెళ్ల, కందనాతి వద్ద ఆరు చెక్‌డ్యాంలను రూ.17.22 లక్షలతో నిర్మించారు. పనులు నాసిరకం చేయడంతో ఏడాదికే కంకర తేలి, పగుళ్లిచ్చి శిథిలమయ్యాయి. ఫారం పాండ్స్, అమృత్ సరోవర్లు, ట్యాంకుల నిర్మాణాలను నిబంధనల మేరకు తవ్వకుండా నిధులు మింగేశారు.హాలహర్వి మండలం బాపురంలో గతేడాది జూన్‌లో రూ.3.18 లక్షలతో చెక్‌డ్యాం నిర్మించారు. సిమెంటు పూత పెచ్చులూడిపోయి కంకర తేలింది. ఒక ఏడాదిలోనే నిర్మాణం దెబ్బతినింది. గట్టి వర్షం వస్తే డ్యాం గోడలు కొట్టుకుపోయే ప్రమాదముందని స్థానిక రైతులు వాపోతున్నారు. చాలా చోట్ల పరిస్థితి ఇలానే ఉంది.

# ఆరోగ్య ప్రాప్తిరస్తు..!

విజయనగరం : గత అయిదేళ్ల కాలంలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం సక్రమంగా దృష్టి పెట్టలేదు. దీంతో చాలా మంది చిన్నారులు జ్వరాల బారిన పడటం, చర్మ వ్యాధులు, రక్తహీనతతో ఆసుపత్రుల్లో చేరేవారు. రక్తహీనత, గుండె నొప్పులతో పలువురు మృతి చెందిన ఘటనలూ నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వారి ఆరోగ్యానికి పెద్ద పీట వేసింది. ప్రతి విద్యార్థికీ ఆరోగ్య పరీక్షలు చేసి వివరాలు రికార్డుల్లో నమోదు చేయనున్నారు. సంబంధిత ఏర్పాట్లను జిల్లా అధికారులు చేస్తున్నారు. బాలల దినోత్సవం సందర్భంగా నవంబరు 14 నుంచి పథకాన్ని పట్టాలెక్కించనున్నారు.

దస్త్రాలు సిద్ధం..

ఉమ్మడి జిల్లా పరిధిలో 3,299 పాఠశాలలు ఉన్నాయి. 2,45,294 మంది చదువుతున్నారు. గతంలో తెదేపా హయాంలో జవహర్ బాలల ఆరోగ్య కార్యక్రమాలు అమలు చేశారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసేవారు. వైకాపా వచ్చాక కార్యక్రమం అటకెక్కింది. గత మార్చిలో ప్రయత్నించినా ఎన్నికల కోడ్ వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం అమలు చేయనుంది. ప్రతి 3 నెలలకు ఓ సారి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. సంబంధిత దస్త్రాలను వైద్య ఆరోగ్య శాఖ సిద్ధం చేసింది.

అన్ని వివరాలు నమోదు..కార్డులో విద్యార్థి వివరాలతో పాటు కుటుంబంలో ఎవరికైనా రక్తపోటు, క్యాన్సర్, మూర్ఛ, మధుమేహం, ఆస్తమా, గుండె జబ్బులు, పుట్టుకతో ఉన్న లోపాలు, రక్త సంబంధీకుల వివాహం వివరాలు నమోదు చేస్తారు. అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన ఫోను నంబర్లు (వైద్యులు, ఉపాధ్యాయుడు, ఏఎన్ఎం) ఉంటాయి. వయసుల వారీగా విద్యార్థుల ఎదుగుదల అంశాలు, ఎత్తు, బరువు, ఛాతీ కొలతలు నమోదు చేయాలి. రక్త హీనత, విటమిన్ల లోపాలు, చర్మ వ్యాధులు మొదలైనవి పరీక్షించిన తేదీ, నిర్ధారణ, కావాల్సిన చికిత్సల వివరాలు తెలియజేస్తారు.

బంగారు భవిత..పార్వతీపురం మన్యంలో 9 పూర్తి, 3 పాక్షిక గిరిజన మండలాలు ఉన్నాయి. ఇక్కడ విద్యార్థుల ఆరోగ్యంపై కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ ప్రత్యేక దృష్టి సారించారు. 'బంగారు భవిత' పేరుతో కార్యక్రమం రూపొందించారు. ప్రతి నెల విద్యార్థులకు పరీక్షలు చేయనున్నారు. సంబంధిత పుస్తకంలో వైద్య పరీక్షలు, లోపాలు నమోదు చేస్తారు. దీంతో గిరిజన విద్యార్థుల్లో రక్తలేమి కేసులకు అడ్డుకట్ట పడనుంది. పక్కాగా అమలు చేస్తాం.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్బీఎస్‌కే, కలెక్టరు రూపొందించిన బంగారు భవితతో విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది. ప్రతి నెల ఆరోగ్య పరీక్షలు జరిగేలా చర్యలు చేపడుతున్నాం.

# నిధులు మెక్కారు

కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగంలో అద్దె కార్ల ముసుగులో నిధులు స్వాహా చేశారు. సొంత కార్లను అద్దె వాహనాలుగా చూపుతూ బినామీ పేర్లతో నిధులు నొక్కేశారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో కొందరు ఇంజినీర్లు ఎలాంటి పర్యటనలు చేయకుండానే చేసినట్లు దస్త్రాలు సృష్టించి భారీగా నిధులు వెనకేసుకొన్నారు. పసుపు బోర్డుతో కూడిన అద్దె వాహనాలు వినియోగించాల్సి ఉండగా.. ఎంచక్కా సొంత కార్లలో తిరిగి బినామీ పేర్లతో బిల్లులు డ్రా చేసుకున్నారు. ఒక ఏడాదిలోనే రూ.23 లక్షలు స్వాహా చేశారు. నాలుగేళ్ల కాలంలో భారీగానే నిధులు స్వాహా చేశారన్న ఆరోపణలున్నాయి.

**ఆదోని నుంచి నిధుల మళ్లింపు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2019 నుంచి అద్దె కార్లకు సంబంధించి భారీగా బకాయిలు ఉన్నాయి.. వెంటనే చెల్లించాల్సి ఉందంటూ కొందరు డీఈఈలు ఇన్‌ఛార్జి ఎస్ఈ నాగేశ్వరరావుపై ఒత్తిడి తీసుకొచ్చారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో ఆదోని ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ కార్యాలయం నుంచి రూ.15 లక్షలను కర్నూలు సర్కిల్ కార్యాలయానికి మళ్లించారు. ఎస్ఈ నాగేశ్వరరావు ఆదోని డివిజన్ ఇన్‌ఛార్జి ఈఈగానూ కొనసాగుతుండటంతో నిధుల మళ్లింపునకు మార్గం సుగమమైంది. గుత్తేదారులు చెల్లించిన సొమ్మును బ్యాంకులో డిపాజిట్ చేసినప్పుడు వచ్చిన వడ్డీ నుంచి రూ.15 లక్షలు డ్రా చేశారు. దీంతోపాటు మరో రూ.8.68 లక్షలు సేకరించారు. ఉ



మ్మడి జిల్లాలో డీఈఈల అద్దె వాహనాలకు రూ.23.68 లక్షల చెల్లింపులు అందజేశారు. డీఈఈలు ఆ సొమ్మును తమ జేబుల్లో వేసుకుని ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ తతంగంలో ఆర్‌డబ్ల్యూఎస్‌కు చెందిన ఓ అధికారి.. ఓ అసోసియేషన్ సభ్యుడితో చేయి కలిపి సంబంధిత ఇంజినీర్ల నుంచి వాటా తీసుకున్నట్లు ఆ శాఖ ఇంజినీర్లు చర్చించుకుంటున్నారు.

**ఏజెన్సీ సృష్టించి**


డీఈఈలు సొంత కార్లలో తిరుగుతూ అద్దె కార్ల పేరుతో రూ.లక్షలు డ్రా చేసుకున్న వైనం వెలుగులోకి వచ్చింది. బినామీ పేర్లతో బిల్లులు పెట్టి ఏజెన్సీలకు కొంత పర్సంటేజీ ఇచ్చి డబ్బులు నొక్కేశారు.

కర్నూలులో చైతన్య ట్రావెల్స్‌కు 2020-21 సంవత్సరానికి సంబంధించి రూ.10.32 లక్షల బిల్లులు చెల్లించారు. వాస్తవంగా ఈ పేరుతో ఎలాంటి ట్రావెల్స్ లేదు. కొందరు ఇంజినీర్లు పక్కా ప్రణాళికతో ఓ ఏజెన్సీని సృష్టించి బినామీ బిల్లులతో సొమ్ము డ్రా చేసుకున్నారు. వీరిలో పత్తికొండ, నందికొట్కూరు, డోన్ సబ్ డివిజన్లకు చెందిన డీఈఈలు ఉన్నారు. ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌కు రూ.1.44 లక్షలు, ఆలూరు రూ.2.88 లక్షలు, నందికొట్కూరు రూ.1.05 లక్షలు, కోడుమూరు రూ.2.88 లక్షలు, డోన్ రూ.4.21 లక్షలు చెల్లించారు.

చైతన్య ట్రావెల్స్‌కు లక్షలు చెల్లించిన విషయాన్ని పసిగట్టిన 'న్యూస్‌టుడే' నిర్వాహకులను సంప్రదించగా కర్నూలులో అలాంటి ఏజెన్సీ ఏదీ లేదని చెప్పడం గమనార్హం.

# ఆర్‌యూలో ఆడిట్‌కు చెల్లు

కర్నూలు : రాయలసీమ విశ్వవిద్యాలయం (ఆర్‌యూ) అక్రమాలకు నిలయంగా మారింది.. పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నా ఉన్నతాధికారులు దృష్టి సారించడం లేదు.. ఇవన్నీ ఎక్కడ వెలుగులోకి వస్తాయన్న ఉద్దేశంతో ఆడిట్ జరగకుండా ఆటంకం సృష్టిస్తున్నారు. విద్యా సంస్థల్లో ఏటా ఆడిట్ నిర్వహించడం ఆనవాయితీ.. ఆర్‌యూలో 2017 నుంచి ఇప్పటి వరకు ముగ్గురు వీసీలు బదిలీ అయ్యారు.. ఒక్కరూ ఆడిట్‌పై దృష్టి పెట్టలేదు. ఏడాది కిందట సస్పెన్షన్‌కు గురైన ఓ ప్రొఫెసర్ విశ్వవిద్యాలయం ఖాతా నుంచి నిధులు మళ్లించుకొన్నారు.. ఆడిట్ జరిగితే వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్న ఉద్దేశంతో ఆడిట్ నిర్వహించకున్నా పెద్దలు జోక్యం చేసుకొన్నారు. దీనిపై కొందరు యూజీసీ, లోకాయుక్త, సీఐడీకి ఫిర్యాదు చేశారు. పరిపాలనా భవనంలోని సీడీసీ విభాగంలో బోధనేతర ఉద్యోగి పదేళ్లుగా అక్కడే తిష్ఠేశారు.. ఏ అధికారి వీసీగా వస్తే ఆ అధికారిని ప్రసన్నం చేసుకోవడం.. అన్నీ తాను చెప్పినట్లే నడవాలంటూ హుకూం జారీ చేస్తున్నారు. గతంలో ఐసెట్ నిర్వహణలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయి.. సదరు ఉద్యోగిపై క్రిమినల్ కేసు నమోదు




చేయాలని పాలక మండలిలో ప్రస్తావించారు. తర్వాత ఎవరూ పట్టించుకోలేదు. నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు కోల్పోయిన 17 మందిని మళ్లీ తీసుకోవడానికి షాడో వీసీ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

వసూళ్ల పర్వం

శాశ్వత ఉద్యోగులకు ఫైనాన్స్ క్లియరెన్స్ ఇప్పిస్తానంటూ ఓ రిజిస్ట్రార్ పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకున్నట్లు సమాచారం. 25 మంది ఉద్యోగుల నుంచి సుమారు రూ.18 లక్షలు వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. సదరు రిజిస్ట్రార్ ఇక్కడి నుంచీ వెళ్లిపోయినప్పటికీ చెరో రూ.10 వేలు ఇస్తే ఫైనాన్స్ క్లియరెన్స్ ఇప్పిస్తానంటూ నమ్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఉద్యోగ విరమణ పొందినా

సైన్సు కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి మార్చిలో ఉద్యోగ విరమణ చేశారు. సదరు ఉద్యోగి నిత్యం కళాశాలకు వస్తున్నారు.. దస్త్రాల్లో సంతకాలు చేస్తున్నారు. టీసీలు, స్టడీ సర్టిఫికెట్లు, విద్యార్థుల థియరీ రికార్డుల్లో సంతకాలు పెడుతున్నారు. ఉన్నతాధికారులకు తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోవం లేదు.

# ఇసుక అక్రమాలకు 'చెక్'



చిత్తూరు : వైకాపా పాలనలో జరిగిన ఇసుక దోపిడీని అరికట్టేందుకు తెదేపా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇసుక ఉచిత విధానాన్ని జులై ఎనిమిదో తేదీ నుంచి అమల్లోకి తెచ్చినా రవాణా ఛార్జీల బాదుడుతో పాటు, సామాన్యులకు ఇసుకను దొరకనీయకుండా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మరో నూతన విధానానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విధివిధానాలు ఖరారు చేస్తూ ఇసుక కావాలనుకునే వారు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాలని స్పష్టం చేసింది. రవాణా ఛార్జీలను దూరాన్ని బట్టి నిర్ణయించింది. ఈ మేరకే రవాణా ఛార్జీలు వసూలు చేసేందుకు రంగం సిద్ధమైంది. ఆన్‌లైన్ విధానం నేటి నుంచి అమల్లోకి రానుంది.

**ఆన్‌లైన్ విధానం ఇలా..**

ఇసుక ఉచితంగా పొందడానికి ప్రజలు ఏపీ శాండ్ పోర్టల్ %https://www. sand.ap.gov.in% లో బుక్ చేసుకోవాలి. అలా చేసుకున్న ఒకటి లేదా రెండు పనిరోజుల్లో ఇంటి వద్దకే సరఫరా చేస్తారు. ఇందుకుగాను.. ఇసుక సరఫరా కేంద్రం నుంచి కొనుగోలుదారు ఇంటి మధ్య దూరాన్ని బట్టి రవాణా ఛార్జీలు చెల్లించాలి. సరఫరా చేసే వాహనం తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గనులు, భూగర్భ వనరుల శాఖ పరిధిలో నమోదై ఉండాలి. పని రోజుల్లో.. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ శాండ్ పోర్టల్‌లో ఆర్డర్ చేయడానికి అనుమతి ఉంటుంది. దగ్గరలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ ఇసుకను ఆర్డర్ చేసుకోవచ్చు. ఇందుకు ఆన్‌లైన్ చెల్లింపులకు మాత్రమే అనుమతిస్తారు.

అక్రమాలకు టోల్‌ఫ్రీ నంబరు..

ఇసుక వినియోగదారులు ఏదైనా ఫిర్యాదు చేయాలనుకుంటే మెయిల్ ఐడీ %chittoorsand75@gmail.com% లేదా టోల్‌ఫ్రీ నంబరు 08572-299509 నంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

ధరలు ఇలా..

చిత్తూరు గ్రామీణ మండలం పాలూరు, దిగువమాసాపల్లి గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన రెండు ఇసుక నిల్వ కేంద్రాల నుంచి ఆన్‌లైన్ బుకింగ్ చేసుకునేందుకు మొదటి విడతగా అనుమతించారు. ఈ రెండు కేంద్రాల్లో టన్ను రూ.155గా నిర్ణయించారు. ఆన్‌లైన్ ద్వారా రూ.775 చెల్లిస్తే ట్రాక్టరు ఇసుక తీసుకోవచ్చు.

రవాణా ఛార్జీలు ఇలా..

పది కిలో మీటర్ల వరకూ టన్ను ఇసుకకు రూ.13.5గా నిర్ణయించారు. అంటే ఒక ట్రాక్టరు ఇసుక 4.5 టన్నులు. ఈ లెక్కన ఒక కిలో మీటరు దూరానికి ఒక ట్రాక్టరు ఇసుక రవాణా చేయడానికి రూ.60.75 కాగా 0-10 కిలో మీటర్ల మధ్య ఎన్ని కిలో మీటర్లు రవాణా చేసినా రూ.607.50 చెల్లించాలి. 11-20 కిలో మీటర్ల మధ్య రవాణాకు ఒక్కో కిలో మీటరుకు రూ.12.8 చొప్పున రూ.1,152 చెల్లించాలి. ఈ లెక్కన పది కిలో మీటర్ల దూరానికి ఇసుక, రవాణా మొత్తం కలిపితే గరిష్ఠంగా రూ.1500 కు దాటదు. 20 కిలో మీటర్ల దూరానికైతే రూ.2 వేలు దాటదు. ఇదివరకైతే ఇంతకు రెట్టింపు ధరను ట్రాక్టరు ఇసుకకు వినియోగదారులు చెల్లించుకోవాల్సి వచ్చేది.

# పురంలో కుంటుపడిన పాలన




హిందూపురం : పారిశుద్ధ్యం పడకేయడంతో మురుగు కాలువల శుభ్రతకు నూతన ప్రభుత్వం రూ.1.3 కోట్లు మంజూరు చేసింది. వాటికి టెండర్లు పిలిచారు. గుత్తేదారుకు పనులు అప్పగించాలంటే కౌన్సిల్ ఆమోదం తప్పని సరి. ఇంటింటికీ నీటి సరఫరా కోసం నూతన పైప్‌లైన్ ఏర్పాటు, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం కోసం నూతన ప్రభుత్వం రూ.120 కోట్ల మంజూరుకు అంగీకరించింది. సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసి, పంపించాలని ఆదేశించింది. ఈ ప్రణాళిక తయారీని నిపుణులతో చేయించాలి. ప్రణాళిక తయారీకి కౌన్సిల్ ఆమోదం అవసరం. మున్సిపల్ పాలనను నడిపించడానికి ప్రతి నెలా కౌన్సిల్ సమావేశం నిర్వహణ తప్పని సరి. హిందూపురంలో ఎన్నికల కారణంగా మార్చి నెల నుంచి జూన్ వరకు సమావేశం జరగలేదు. జులైలో జరిగినా వైకాపా సభ్యుల మెజార్టీ ఉండటంతో అధికారులు ప్రతిపాదించిన పనులను అడ్డుకొన్నారు. ఆగస్టులో ఛైర్‌పర్సన్ పదవి నుంచి తప్పుకోవడంతో, రాజీనామా ఆమోదానికి మాత్రమే సమావేశం పరిమితమైంది. నూతన ఛైర్మన్ ఎన్నిక తరువాత సమావేశం నిర్వహించాలని అధికారులు భావించారు. అయితే ఎన్నిక నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయకపోవడంతో ఛైర్మన్ ఎన్నిక ఆలస్యం అవుతోంది. వైస్ ఛైర్మన్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించడానికి అవకాశం ఉంది. అయితే సమావేశ నిర్వహణకు ఎవరూ చొరవ తీసుకోవడం లేదు. దీంతో నడిపించే వారు లేక మున్సిపల్ పాలన కుంటుపడింది. సమావేశం జరపాలని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి మున్సిపల్ అధికారులకు ఆదేశాలు వచ్చినా, ఇటీవల వైకాపా నుంచి తెదేపాలో చేరిన కౌన్సిలర్లు అభ్యంతరం చెబుతున్నారు. వైకాపాకు చెందిన వైస్ ఛైర్మన్ అధ్యక్షతన సమావేశం నిర్వహణకు వారు అంగీకరించడం లేదని తెలుస్తోంది. రాజకీయ విభేదాల కారణంగా పట్టణ ప్రగతికి అడ్డంకులు ఎదురవుతున్నాయి.

గొల్లపల్లి నుంచి పట్టణానికి నీటిని తీసుకొచ్చే తాగునీటి పథకంలో పంపుహౌస్‌ల వద్ద మోటార్లు, నియంత్రికలు సరిగా పని చేయడం లేదు. ఇన్‌టెక్ వెల్ వద్ద, మరో రెండు పంపు హౌస్‌లలో ఒకే ఒక్క మోటారు పని చేస్తున్నాయి. అవి ఏ క్షణమైనా నిలిచిపోవచ్చు. తాగునీటి పథకానికి అత్యవసరంగా మరమ్మతులు చేయించాల్సి ఉంది. ఈ పనుల కోసం గత ప్రభుత్వ హయాంలోనే 8 నెలల క్రితమే రూ.2 కోట్లు కేటాయించి, టెండర్లు పిలిచారు. అయితే సొంత పార్టీ కౌన్సిలర్లే అడ్డుకోవడంతో గుత్తేదారులకు పనులు కేటాయించలేదు. కౌన్సిల్ సమావేశంలో మెజార్టీ సభ్యులు ఆమోదం తెలిపితే, వెంటనే మరమ్మతుల పనులు చేయవచ్చు.

పలు కాలనీల్లో మురుగు కాలువలు, చిన్నచిన్న రోడ్లు నిర్మించాల్సి ఉంది. ఈ పనులకు టెండర్లు పిలవాలంటే కౌన్సిల్ అనుమతి కావాలి. మున్సిపల్ అధికారులు రూ.లక్షకు పైగా ఖర్చు పెట్టాలంటే మున్సిపల్ కౌన్సిల్ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలి.

సమావేశం నిర్వహిస్తాం -శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్

ఛైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ వచ్చినా, రాకపోయినా ఈ నెలలో కౌన్సిల్ సమావేశం తప్పని సరిగా నిర్వహిస్తాం. ఎన్నిక జరగకపోతే, వైస్ ఛైర్మన్ అధ్యక్షతన సమావేశం జరుగుతుంది. అభివృద్ధి పనులు, నిర్వహణ పనులకు కౌన్సిల్ ఆమోదం తీసుకొంటాం.

# మత్తుకు మరో రూపం

చంద్రగిరి : చంద్రగిరి ప్రాంతంలో మత్తు మరో రూపం దాల్చుతోంది. గతంలో విచ్చలవిడిగా గంజాయి వాడకం ఉండేది. మూడు నెలలుగా గంజాయి పెద్దగా దొరక్కపోవడంతో.. తాజాగా క్షణాల్లో మత్తిచ్చే ఇంజక్షన్లు, సిరప్స్, మాత్రలను వినియోగిస్తున్నారు. స్థానిక దుకాణాల్లో ఓ గమ్‌ను కొనుగోలు చేసి.. దాన్ని కాల్చి ఆవిరి పీల్చుతూ మత్తులోకి జారుకుంటున్నారు.

ఇవే స్థావరాలు..

నరశింగాపురం పొలిమేరలోని మఠం భూమిలో పాడుబడ్డ షెడ్‌లో నిత్యం కొందరు యువకులు ఇంజక్షన్లు తీసుకుని మత్తులో తేలుతున్నారు. ఎగువరెడ్డివారిపల్లి గ్రామంలోని కనుమవంకతోపాటు దానికి కూతవేటు దూరంలో ముళ్లపొదల్ల మాటున్న ఉన్న రాయలవారికాలం నాటి గంటా మండపంను కూడా అడ్డాగా చేసుకున్నారు. దీన్ని గమనించిన స్థానికులు వారిని వారిస్తుండటంతో దాడి చేసేందుకు తిరగబడుతున్నారు. వీరు మత్తులో ఎప్పుడేం చేస్తారోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.


ఎక్కడ దొరుకుతున్నాయి..?

గతంలో చంద్రగిరి, ఇందిరమ్మకాలనీ, ఐతేపల్లి, బండకాడపల్లి, అగరాల ప్రాంతాల్లో మాఫియా గుట్టు చప్పుడు కాకుండా యువతకు గంజాయి విక్రయించేది. ప్రస్తుతం మఫ్టీలో పోలీసులు నిఘా ఉండటంతో మత్తుకు బానిసలైన యువకులు ప్రత్యామ్నాయంగా మత్తునిచ్చే ఇంజక్షన్లు, సిరప్‌లు, మాత్రలు వాడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు ఆయా ప్రాంతాల్లో నిఘాపెట్టి మత్తుకు బానిసలవుతున్న యువతను గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉంది. మెడికల్ దుకాణాల్లోనూ వైద్యుల చీటీ లేనిదే మత్తు ఇంజక్షన్లు, మాత్రలు ఇవ్వకుండా దుకాణాల యజమానులను సమావేశపరచి హెచ్చరించాలని ప్రజలు కోరుతున్నారు.

# ఉద్యాన రైతుకు ఊరట

పాడేరు : వ్యవసాయ పంటలతో పోలిస్తే ఉద్యాన పంటల సాగు మంచి ఆదాయ మార్గంగా నిలిచేది. గత వైకాపా ప్రభుత్వం దీన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. రాయితీలకు కోతపెట్టి ఉద్యాన రైతును ఉసూరుమనిపించింది. ఎక్కడైనా సాగు బాగుంటేనే రైతన్నకు లాభం.. ఆర్థిక వ్యవస్థకు ఊతం.. అలాంటి సాగు లాభసాటిగా ఉండాలంటే ప్రభుత్వపరంగా ప్రోత్సాహకాలు కీలకం. ఆ దిశగానే తెదేపా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను విడుదల చేయడమే కాకుండా 2024-25లో అమలు చేయాల్సిన పథకాలు, నిధుల కేటాయింపు లక్ష్యాలను విధించడంతో ఉద్యాన రైతులకు ఎంతో ఊరట కలిగిస్తోంది.

ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్‌కేవీవై, ఎంఐడీహెచ్, నేషనల్ మిషన్ ఫర్ ఎడిబుల్ ఆయిల్ పథకాల ద్వారా ఆర్థిక సాయం అందిస్తుంది. వీటికి రాష్ట్ర ప్రభుత్వం వాటాధనం కొంత కలిపి రైతులకు అందజేయాలి. వైకాపా అధికారంలో ఉన్న అయిదేళ్లు ఈ ప్రోత్సాహకాల్లో ఒక్క రూపాయి చెల్లించలేదు. ఉమ్మడి విశాఖ జిల్లా మొత్తంగా 14.27 కోట్ల మేర రైతులకు రాయితీ బకాయిలుండిపోయాయి. దీంతో ఉద్యాన పంటల సాగుకి వెనుకంజ వేసే పరిస్థితి నెలకొంది. తెదేపా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యాన రైతుకు ఊతమివ్వాలని నిర్ణయించింది. గత ప్రభుత్వం పెట్టిన బకాయిల్లో తొలి రెండేళ్ల రాయితీ సొమ్ములు రూ.3.28 కోట్లు నిధులు అనకాపల్లి జిల్లాకు రూ.53.70 లక్షలు అల్లూరి జిల్లాకు విడుదల చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ ఉద్యాన పంటలను ప్రోత్సహించేలా పెద్దఎత్తున కార్యక్రమాలను చేపడుతున్నారు. కూరగాయల సాగుకు ఆర్‌కేవీవై



రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై) ద్వారా అనకాపల్లి జిల్లాలో 480 హెకార్టర్లు, అల్లూరి జిల్లాలో 293 హెక్టార్లలో కూరగాయల సాగుకు ప్రణాళికలు రూపొందించారు.

సాగులో ఆధునిక పద్ధతులు, శాశ్వత పందిళ్లు, సేకరణ కేంద్రాలు, సౌరశక్తితో నడిచే శీతల గదుల నిర్మాణాలను ప్రోత్సహిస్తారు.

పండ్ల తోటలకు ప్రత్యేకం ఈ పథకం..

ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్ (ఎంఐడీహెచ్) పథకం ద్వారా పండ్ల తోటల సాగును ప్రోత్సహించి ఏటా ఆ పంటల విస్తీర్ణం పెంచాలన్నది లక్ష్యం.

పండ్ల తోట పెంపకం, నిర్వహణ, తోటల పునరుద్ధరణ, ప్యాక్ హౌస్, శీతల గదులు, రైపనింగ్ ఛాంబర్లు, సేకరణ కేంద్రాలు, యాంత్రీకరణ పరికరాలు, పంట ఉత్పత్తిదారుల సంఘాలకు శిక్షణ ఇస్తారు.

పండ్ల తోటల్లో మల్చింగ్, పక్షుల నుంచి రక్షణకు నెట్ ఏర్పాటు, నీటి కుంటల ఏర్పాటుకు సాయమందిస్తారు.

అల్లూరి జిల్లాలో సేకరణ కేంద్రాలు, శీతల గిడ్డంగుల నిర్మాణానికి పంట ఉత్పత్తిదారుల సంఘాలకు 75 శాతం రాయితీలు కల్పిస్తున్నారు. 240 చ.అ. విస్తీర్ణంలో సేకరణ కేంద్రం నిర్మించుకుంటే రూ.15 లక్షలు ఖర్చవుతుంది. అందులో ఆర్‌కేవీవై నుంచి రూ.5.25 లక్షలు, ఎంఐడీహెచ్ నుంచి రూ.6 లక్షలు మొత్తంగా రూ.11.25 లక్షలు రాయితీగా ఇవ్వనున్నారు.

కూరగాయల రవాణాలో 30 నుంచి

35 శాతం పాడవుతుంటాయి. దీన్ని నివారించేందుకు కోత తర్వాత శుభ్రం చేయడం, శీతల గదుల్లో నిల్వ చేయడం, శీతల సౌకర్యం ఉన్న వాహనాల్లో రవాణా చేయడానికి ఈ పథకం నిధులు వెచ్చిస్తారు.


సాగుకు ప్రోత్సాహం..:

రెండేళ్ల బకాయిలను ఇటీవల విడుదల చేశారు. మిగతా బకాయిలు కూడా త్వరలోనే అందజేయనున్నారు. దీనివల్ల ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం దక్కనుంది. రైతులు ఉత్సాహంగా సాగుకు ముందుకు వస్తారు. ఈ ఏడాది సాగు విస్తీర్ణంలో లక్ష్యాలను అందుకునే విధంగా ప్రణాళికలు అమలు చేస్తున్నాం.

-ప్రభాకర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

# అవకాశాన్ని వదులుకోవద్దు

పాడేరు : విద్యార్థుల్లో శక్తిసామర్థ్యాలను వెలికితీసి, వారి చదువుకు ఆర్థికసాయంగా నిలిచే ఎన్.ఎం.ఎం.ఎస్. ఉపకార వేతనానికి సంబంధించి పరీక్ష దరఖాస్తుకు ప్రభుత్వం గడువు పెంచింది. కేంద్ర ప్రభుత్వం 2008 నుంచి రాష్ట్రాల సహకారంతో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పథకాన్ని అమలు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువు పట్ల ఆసక్తి పెంచి పై చదువులు కొనసాగించడానికి వీలుగా ఉపకార వేతన రూపంలో ప్రోత్సహిస్తోంది. ఏటా వందల మంది దీనికి ఎంపికవుతున్నారు. ఈ పరీక్ష డిసెంబరులో అనకాపల్లి, నర్సీపట్నం కేంద్రాలుగా నిర్వహించనున్నారు. ఇప్పటికే చాలా బడుల్లో విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. దీనికి గడువు ఇటీవలే ముగిసిపోయింది. ప్రకృతి వైపరీత్యాలు, ఇతర కారణాలతో చాలాచోట్ల పాఠశాలలకు సెలవులు రావడంతో అనుకున్న స్థాయిలో దరఖాస్తులు రాలేదు. దీంతో మరో అవకాశం కల్పించేలా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. అనకాపల్లి జిల్లాలో గతేడాది దీనికి 4,315 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి 3,552 మంది విద్యార్థులు మాత్రమే ఇంత వరకు దరఖాస్తు చేసుకున్నారు. అల్లూరి జిల్లాలో 2023 విద్యా సంవత్సరంలో 518 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 470 మంది ఆన్‌లైన్



ద్వారా దరఖాస్తు చేసుకున్నారని డీఈఓ బ్రహ్మాజీరావు పేర్కొన్నారు. దీంతో తుది గడువు ఈనెల 24 వరకు పెంచింది. మరో నాలుగు రోజులు అవకాశం ఉన్న నేపథ్యంలో మరింత మంది సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు దృష్టిసారిస్తే విద్యార్థులకు మేలు జరుగుతుంది.

ప్రతి పాఠశాల నుంచి దరఖాస్తు చేయాలి: విద్యార్థుల చదువుకు ఎన్.ఎం.ఎం.ఎస్. ఎంతో ఉపకరిస్తుంది. ముఖ్యంగా విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచుతుంది. దీన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలి. ఉన్నతాధికారులు మరో అవకాశం కల్పిస్తూ గడువు పెంచారు. ప్రతి పాఠశాల నుంచి వీలైనంత ఎక్కువ మందితో దరఖాస్తు చేయించేలా ఉపాధ్యాయులు చూడాలి.

– ఎం.వెంకటలక్ష్మమ్మ, డీఈఓ

# విడి నూనె విక్రయానికి అక్రమాల ముడి

కర్నూలు : వంటింటి 'నూనె' ధర సలసల కాగుతోంది.. ధరలు పెరగడంతో వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు.. నిబంధనలకు విరుద్ధంగా విడి(లూజు)గా విక్రయిస్తున్నారు.. మరికొందరు కల్తీ చేస్తున్నారు.. మరికొన్ని దుకాణాల్లో పాత సరకును కొత్త ధరలతో విక్రయిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 13.50 లక్షల కుటుంబాలు ఉన్నాయి. సగటున నెలకు 80 లక్షల లీటర్ల నూనె వినియోగిస్తారు. కేంద్రం నూనెలపై దిగుమతి సుంకం పెంచడంతో ధరలు భగ్గుమంటున్నాయి. లీటరుపై కనిష్ఠంగా రూ.15.. గరిష్ఠంగా రూ.25 వరకు పెరిగింది. ఉమ్మడి జిల్లా వాసులపై ప్రతి నెలా రూ.15–20 కోట్ల అదనపు భారం పడింది. వచ్చే నెలలో దసరా, దీపావళి తదితర ముఖ్యమైన పండగలు రానున్నాయి. నూనెల వాడకం భారీగా పెరగనుంది..భారం మోయాల్సిందేనని సామాన్యులు వాపోతున్నారు.

యథేచ్ఛగా కల్తీ

ధరలు పెరగడంతో కల్తీ పెత్తనం చేస్తోంది. అల్పాహారశాలలు, చిన్న హోటళ్లు, బజ్జీ కొట్ల వారు తక్కువ ధరకు దొరికే (కల్తీ ) నూనె కొనుగోలు చేస్తున్నారు. కల్తీ రకం నూనెలు సుమారు వెయ్యి టన్నుల వరకు వాడుతున్నారు.

పామాయిల్ నూనెను హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, టిఫిన్ సెంటర్లు, బజ్జీ కొట్ల నిర్వాహకులతోపాటు పేద, మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువగా వాడుతాయి. నెలకు 5 వేల టన్నులు వినియోగిస్తున్నారు. పొద్దుతిరుగుడు రకం వంట నూనెలను 2 వేల టన్నుల వరకు విక్రయాలు జరుగుతాయి.

నెలకు రూ.20 కోట్ల భారం

కేంద్రం ఈ నెల 14 నుంచి వంట నూనెలపై 20 శాతం సుంకం విధించింది. సరఫరాదారులు ఆ భారాన్ని వ్యాపారులపైనా.. వ్యాపారులు ప్రజలపై మోపారు. ఇరవై శాతం అంటే ఒక్కో నూనె ప్యాకెట్‌పై సుమారు రూ.20–25 వరకు ధర పెరిగింది. ఈ నెల రెండో వారంలో పామాయిల్ లీటరు ధర రూ.85 ఉండగా.. ఇప్పుడది రూ.110, రూ.120 దాటడం గమనార్హం.

పొద్దుతిరుగుడు నూనె లీటరు ప్యాకెట్ ధర రూ.108 నుంచి రూ.125కు పెరిగింది. పామాయిల్ లీటరు రూ.95 ఉండగా.. ప్రస్తుతం 800 మి.లీ ప్యాకెట్‌ను రూ.110, 910 మి.లీ ప్యాకెట్‌ను రూ.120కు విక్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వాసులపై ప్రతి నెలా రూ.15–20 కోట్ల అదనపు భారం పడుతోంది.

నిబంధనలకు విరుద్ధంగా 'విడి' విక్రయం

ఉమ్మడి కర్నూలుకు కృష్ణపట్నం నుంచి ఆయిల్‌ను దిగుమతి అవుతోంది. జిల్లాలోని నాలుగు ప్యాకింగ్ యూనిట్లలో ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు. లోకల్ బ్రాండ్ ఆయిల్ ప్యాకింగ్ యూనిట్లు నడుస్తున్నాయని పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు. బయట నుంచి ముడి సరకు తెచ్చుకొని కేవలం ప్యాకింగ్ చేసి మార్కెట్‌లోకి విక్రయించే పరిశ్రమలు ఐదారు ఉన్నాయి.

విడిగా(లూజు) వంట నూనెలు అమ్మకూడదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో విడిగా విక్రయిస్తున్నారు. రోజువారీగా రూ.50 లక్షల వరకు లూజు నూనె వ్యాపారం జరుగుతున్నా పట్టించుకోవడం లేదు.ఆయిల్ మిల్లులు, రిఫైన్డ్ ప్యాకింగ్ యూనిట్లలో నూనెలు నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కొన్ని కంపెనీలు 800 ఎంఎల్, మరికొన్ని 850, 900, 910 ఎంఎల్.. ఇలా వివిధ పరిమాణాల్లో వంట నూనెలు అమ్ముతున్నారు.

అధిక నిల్వలపై ఆరా

నూనెలకు సంబంధించి కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచితే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హెచ్చరించారు. కల్లూరు పారిశ్రామికవాడలోని దామోదర్ ఆయిల్‌మిల్, అశ్విని ఆయిల్ ప్యాకింగ్ యూనిట్లలో బుధవారం తనిఖీలు చేశారు. ఉండాల్సిన నిల్వల కంటే అధికంగా ఉండటంతో రూ.10 వేల జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో తూనికలు, కొలతలు, పౌరసరఫరాల తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నియంత్రణ మా చేతుల్లో లేదు

– కేవీఎస్ఎం ప్రసాద్, జిల్లా పౌరసరఫరాల అధికారి

నూనె మిల్లులు.. ప్యాకింగ్ యూనిట్లపై మాకు ఎలాంటి అధికారం లేదు. ఫుడ్ గ్రేయిన్స్ లైసెన్సు ఇచ్చే అధికారం మా చేతుల్లో లేదు. అందుకే వాటిపై మాకు అధికారాలు ఉండవు. మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించినా ధరలను నియంత్రించే అధికారం లేదు. పరిమాణంలో వ్యత్యాసాలుంటే తూనికలు, కొలతల శాఖ అధికారులు చర్యలు తీసుకుంటారు. నాణ్యత ప్రమాణాలకు సంబంధించి ఏపీ ఆహార (ఆరోగ్య) పాలన శాఖ అధికారులకు అధికారాలున్నాయి. అధిక ధరలకు విక్రయించినా.. నాణ్యతా లోపమున్నా 6(ఏ) కేసులు నమోదు చేసే అధికారులు కూడా మా చేతుల్లో లేదు.

# తీరనున్న ఇసుక ఇక్కట్లు

కర్నూలు : ఆన్‌లైన్ ఇసుక విధానం ప్రారంభం కానుంది.. వినియోగదారులు రవాణా, నిర్వహణ ఖర్చులే భరించాల్సి ఉంటుంది. సి.బెళగల్ మండలం ఈర్లదిన్నె, కొత్తకోట, సింగవరం, ముడుమాల, పల్దొడి గ్రామాల పరిధిలో ఇసుక తవ్వకం కేంద్రాలు ఉన్నాయి.. ఐదు కేంద్రాల్లో 20–25 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. గత 20 రోజులుగా మాన్యువల్‌గా విక్రయించారు.. టన్ను రూ.326 చొప్పున 6,78,815 టన్నుల మేర విక్రయించారు. ప్రస్తుతం టన్ను ఇసుకను రూ.326కు విక్రయిస్తున్నారు. జీఎస్టీ కొంతమేర తగ్గించే అవకాశాలు



న్నాయి.మూడు జిల్లాల వారికి

కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లా వాసులు నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ డీడీ రాజశేఖర్ తెలిపారు. అనంతపురం జిల్లా వాసులకు ఆన్‌లైన్ నమోదుకు లింక్‌ను అందించామన్నారు. ఇసుక అవసరమైనవారు ఎక్కడి నుంచైనా బుకింగ్ చేసుకోవచ్చు.

చరవాణిలో నమోదు

గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. చరవాణిలో మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. సరఫరా చేసేందుకు వాహనదారులు తమ వాహనాలను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ట్రాక్టర్లు, టిప్పర్లు కలిపి కర్నూలులో 175 మంది, నంద్యాలలో 190 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో 32 వాహనదారులే నిర్ణీత రుసుము చెల్లించి ఒప్పందం చేసుకున్నాయి.

# నీరు పుష్కలం.. సరఫరానే కీలకం



అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లా తాగు, సాగునీటి కేటాయింపులపై చర్చించి.. కీలక నిర్ణయాలు తీసుకునే నీటి సలహా మండలి(ఐఏబీ) సమావేశానికి అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఏటా ఒకసారే జరిగే సమావేశం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరుకానున్నారు. నేడు (19న) అనంత కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో సమీక్ష ఉంటుంది. హెచ్చెల్సీ పరిధిలో స్థిరీకరణ ఆయకట్టు ఉండటంతో తుంగభద్ర జలాశయం నుంచి దక్కే నీటి వాటా కేటాయింపుల్లో వివాదాలు లేవు. హంద్రీనీవా పరిధిలో ఇప్పటికీ ఆయకట్టు స్థిరీకరణ జరగలేదు. డిస్ట్రిబ్యూటరీలు లేకపోవడమే కారణం. దీంతో హంద్రీనీవాకు వచ్చే నీటిలోనే వివాదం తలెత్తే అవకాశం ఉంది. తుంగభద్ర, శ్రీశైలంలో జలాలు ఉన్నా కాలువల ద్వారా ఆశించిన మేర ఉమ్మడి అనంత జిల్లాకు నీరు తెచ్చుకోలేని దయనీయ దుస్థితి. శిథిలావస్థకు చేరిన ప్రధాన కాలువలను ఆధునికీకరణ చేయకపోవడమే అసలు కారణం. గత వైకాపా ప్రభుత్వం నిర్వహణను గాలికి వదిలేసింది. నయాపైసా ఇవ్వకపోవడంతో మరమ్మతులు, కాలువల వెడల్పు వంటి ప్రధాన పనులు చేయనేలేదు. వైకాపా చేసిన పాపానికి జిల్లా ప్రజలు, కర్షకులు అవస్థలు పడాల్సి వస్తోంది.

**ఆశించినట్లుగా..**

గతేడాదితో పోల్చితే ఈదఫా హెచ్చెల్సీకి ఆశించిన మేర నీరు రానుంది. దామాషా ప్రకారం తుంగభద్ర నుంచి హెచ్చెల్సీకి 26.368 టీఎంసీలు దక్కనున్నాయి. ప్రధాన కాలువ, గుంతకల్లు ఉప కాలువ(జీబీసీ)కు ప్రవాహం సాగుతోంది. ఎమ్పీఆర్, పీఏబీఆర్‌లకు 650 క్యూసెక్కుల మేర ప్రవాహం ఉంది. రెండు జలాశయాల కింద కాలువలకు నీరు విడుదల చేయాల్సి ఉంది. కేటాయింపులు, విడుదల తేదీలను ఐఏబీ నిర్ణయించాల్సి ఉంది.

**కనీసం 50 చెరువులకు..**

శ్రీశైలం నుంచి హంద్రీనీవా కాలువకు కనీసం 40 టీఎంసీలు ఎత్తిపోయాలని సంకల్పించారు. ప్రస్తుతం శ్రీశైలంలో దండిగా నీరు ఉంది. ఆశించిన మేర ప్రవాహం కొనసాగడం లేదు. పంట కాలువలు లేకపోవడంతో పంపుసెట్లు, పైపుల ద్వారా తోడి సాగు చేస్తున్నారు. మరోవైపు తొలి, రెండో దశ కింద కనీసం 50 చెరువులకు నీరు ఇవ్వాలని అనుకుంటున్నారు. ఇప్పటికే తొలి దశ కింద ఏడు, రెండో దశలో మూడు చెరువులకు నీరు ఇచ్చారు. జీడిపల్లి, గొల్లపల్లి, మారాల, చెర్లోపల్లి జలాశయాలకు ఇవ్వాల్సి ఉంది. మడకశిర, పుంగనూరు ఉప కాలువలకు సరఫరా చేయాలి. ఉమ్మడి అనంత జిల్లా ప్రజలు హంద్రీనీవాపై ఆశలు పెంచుకున్నారు.

**పర్యవేక్షణ ప్రధానం**

హెచ్చెల్సీ పరిధిలో నీరు అక్రమంగా వినియోగించే వకాశం ఉంది. ఇందుకు లస్కర్లు కీలకం. మొత్తం 416 మందికి గాను.. కేవలం 84 మందే ఉన్నారు. గస్తీ తిరగడానికి అద్దె వాహనాలను సమకూర్చాలి. నీటి పంపిణీ నిర్దేశిత దామాషా ప్రకారం జరగాలి. లేకపోతే చివరి ఆయకట్టు నష్టపోయే ప్రమాదం ఉంది. తాగునీటి కోసం పీఏబీఆర్, ఎమ్పీఆర్‌కు కనీసం 500 క్యూసెక్కుల పైగా ఇన్‌ఫ్లో పెంచకపోతే ప్రవాహం ప్రశ్నార్థకంగా మారనుంది. పీఏబీఆర్ కుడి కాలువ కిందే 42 చెరువులు ఉన్నాయి. వీటిని నింపాలంటే హంద్రీనీవా నుంచి రోజూ కనీసం 300 క్యూసెక్కులు ప్రవాహం సాగాలి. కేసీ కాలువ మళ్లింపు కింద వచ్చే 10 టీఎంసీల ఆధారంగానే పీఏబీఆర్ కుడి కాలువ, యాడికి కాలువ, పెండేకల్లు, చాగల్లు జలాశయాలు ఆధార పడ్డాయి. పీఏబీఆర్‌కు వచ్చే కృష్ణా జలాలే శింగనమల చెరువుకు ఆధారం.

# అంతా ఆధునికం.. అందని వైద్యం?




అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లా ప్రజలకు వరంగా మారిన ప్రభుత్వ సూపర్ స్పెషాల్టీ వైద్యశాలలో సమస్యలు కోకొల్లలు. అత్యాధునిక సౌకర్యాలున్నా వినియోగించుకోలేని దయనీయ దుస్థితి. పలు విభాగాలకు వైద్యనిపుణులు లేకపోవడంతో రూ.కోట్లు విలువైన పరికరాలు నిరుపయోగంగా మారాయి. ఫలితంగా రోగులకు సకాలంలో వైద్యసేవలు అందడం లేదు. రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ వైద్యశాలను సందర్శించనున్నారు. సమస్యలపై దృష్టి సారించి.. పరిష్కారం చూపాలని ఉమ్మడి జిల్లా వాసులు కోరుతున్నారు.

**వైద్యుల పోస్టులు 40.. ఉండేది 15 మందే**

న్యూరోసర్జరీ, కార్డియాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, న్యూరాలజీ తదితర విభాగాలున్నాయి. ప్రతి విభాగంలో ప్రొఫెసర్, ఒక అసోసియేట్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండాలి. న్యూరోసర్జరీ మినహా మిగిలిన అన్ని విభాగాల్లో వైద్యుల కొరత వేధిస్తోంది. మొత్తం పది విభాగాల్లో 40మంది వైద్యులు ఉండాల్సి ఉండగా 15 మందితోనే నెట్టుకొస్తున్నారు.

**ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకే..**


వారంలో రెండు రోజులు ఓపీ సేవలు అందిస్తున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకే ఓపీ ఉంటుంది. రెండు రోజుల్లో సుమారు 600 నుంచి 800 మంది రోగులు వస్తుంటారు. ఇన్‌పేషంట్లు 30 నుంచి 40 మందికి వరకు ఉంటారు. ఫార్మసీ 24 గంటల పాటు పనిచేయటం లేదు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకే ఉంటుంది.

**ఎంఆర్ఐ, రక్తనిధి ఏదీ?**ఆసుపత్రిలో ఎంఆర్ఐ, రక్తనిధికి అధునాతన గదులను ఏర్పాటు చేశారు. ఆయా విభాగాల్లో యంత్రాలు ఏర్పాటు చేయలేదు. ఓపీకి వచ్చే సగటున 30 మందికి ఎంఆర్ఐ చేయించుకురావాలని వైద్యులు రాసిస్తున్నారు. దీంతో రోగులు వ్యయప్రయాసలకు గురవుతున్నారు. రక్తనిధి లేకపోవటంతో రోగి సహాయకులు సర్వజన వైద్యశాల, ప్రైవేటు రక్తకేంద్రాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. **ఉన్నా ఉపయోగం లేదాయె**మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగానికి వైద్యులు లేకపోవటంతో మూతపడింది. రూ.1.80 కోట్లు విలువ చేసే ఫైబ్రోస్కాన్, రూ.30 లక్షలు విలువ చేసే ఎండోస్కోపి ఆల్ట్రాసౌండ్ యంత్రం నిరుపయో గంగా మారాయి. ప్రైవేటులో పరీక్షలు చేయించుకోవాలంటే సగటున రూ.3వేల నుంచి రూ.5వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

# అంగన్‌వాడీ కేంద్రాలకు ఊతం

అనంతపురం : రాష్ట్రంలో తెదేపా కూటమి ప్రభుత్వం రాగానే అంగన్‌వాడీ కేంద్రాలకు దశ తిరగనుంది. మూడు మాసాలకే మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించింది. అన్ని వసతులతో బలోపేతం చేసేందుకు చర్యలకు ఉపక్రమించింది. జిల్లావ్యాప్తంగా మరుగుదొడ్లు, తాగునీటి కల్పన కోసం ఒకేసారి రూ.3.25 కోట్ల నిధులు మంజూరు చేయడం విశేషం. ఈ విషయాన్ని ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి పేర్కొన్నారు. త్వరగా వసతులు కల్పించేందుకు చర్యలు చేపడతామని ఆమె అన్నారు. జిల్లావ్యాప్తంగా పదకొండు ప్రాజెక్టుల పరిధిలో 2302 అంగన్‌వాడీ కేంద్రాల్లో.. 1064 కేంద్రాలకు పక్కా భవనాలు ఉన్నాయి. గడిచిన వైకాపా ప్రభుత్వ హయాంలో పక్కా భవనాల నిర్మాణానికి తగిన చొరవ చూపలేదు. కనీస మౌలిక వసతులు కల్పించలేదు. దీని పర్యావసానంగా పేద పిల్లలు, గర్భిణి, బాలింతలు అసౌకర్యాల నడుమ విద్యా బోధన, కేంద్రాల సందర్శన సాగుతూ వచ్చింది. అరకొర పౌష్టికాహార పంపిణీకే పరిమితమైంది. ప్రస్తుత తెదేపా కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టగానే అంగన్‌వాడీలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి పూనుకుంది. తొలి విడతగా 1,232 రకాల పనుల కోసం రూ.3.25 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇందులో 609 కేంద్రాలకు మరుగుదొడ్లు, 623 కేంద్రాలకు తాగునీటిని కల్పించేందుకు చర్యలు మొదలయ్యాయి.

**ఆర్‌డబ్ల్యూఎస్ కే బాధ్యత**



మరుగుదొడ్లు, తాగునీటి కల్పనకు సంబంధించిన పనుల నిర్వహణ బాధ్యతను జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్)కే అప్పగించారు. ఒకో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.36 వేలు చొప్పున 609 పనులకు రూ.2.19 కోట్లు, తాగునీటి కల్పన కోసం ఒకోదానికి రూ.17 వేలు ప్రకారం 623 పనులకు రూ.1.06 కోట్లు మేర నిధులు వెచ్చించారు. సత్వరమే ఈ పనులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. మొత్తం 1,232 పనుల్లో ఎక్కువగా ఉరవకొండ ప్రాజెక్టులో 230 ఉన్నాయి. గుత్తి, అనంత గ్రామీణం, రాయదుర్గం, కంబదూరు, కళ్యాణదుర్గం, తాడిపత్రి, శింగనమల ప్రాజెక్టుల పరిధిలో వందకుపైగా పనులు ఉన్నాయి. అతి తక్కువగా అనంత అర్బన్‌లో కేవలం నాలుగు పనులే. ఇక్కడ పక్కా భవనాలు రెండు మాత్రమే ఉన్నాయి. నార్పల, కణేకల్లు ప్రాజెక్టుల్లో 50 నుంచి 60 పనుల సంఖ్య మధ్యలో ఉన్నాయి.

# రైతు నెత్తిన వడ్డీ

ఎమ్మిగనూరు : వేరుశనగ క్రయవిక్రయాలకు పేరొందిన ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్లో కొందరు కమీషన్ ఏజెంట్లు రైతులను నిలువునా ముంచుతున్నారు. మార్కెట్‌కు సరకు తెచ్చిన కర్షకుల కష్టాన్ని దోచుకొంటున్నారు. ఒకరి వద్దకు సరకు తీసుకెళ్తే మరొకరు తక్‌పట్టీలు ఇచ్చి రెండింతల కమీషన్ తీసుకొంటున్నారు. ఇటీవల ఓ రైతు కమీషన్ ఏజెంటు వద్దకు పంట దిగుబడులు తీసుకొచ్చారు. విక్రయించిన తర్వాత ఆ ఏజెంటు కాకుండా మరొక ఏజెంటు ఆ రైతుకు నగదు ఇవ్వడంతో వెలుగులోకి వచ్చింది. మార్కెట్లో 15 మంది ఏజెంట్లు మాయాజాలం చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరి నిర్వాకం వల్ల ఈ సీజన్లో రైతులపై రూ.2 కోట్ల భారం పడింది.

డ్రైవర్లకు నగదు ఎర పంట దిగుబడులు ట్రాలీ ఆటో, ఇతర వాహనాల్లో మార్కెట్‌కు తీసుకొస్తుంటారు. దూరాన్ని బట్టి రైతులు రవాణా ఛార్జీ చెల్లిస్తారు. పల్లెల నుంచి మార్కెటుకు సరకు తెచ్చే వాహనదారులతో వ్యాపారులు ముందస్తు ఒప్పందాలు చేసుకొంటున్నారు. తమ దుకాణాలకే సరకు తీసుకొస్తే సంచికి రూ.10 నుంచి రూ.20 వరకు అదనంగా ఇస్తారు. ఇదంతా రైతులకు తెలియకుండా గుట్టుగా జరుగుతోంది.రైతులపై రూ.2 కోట్ల భారం

వ్యవసాయ మార్కెట్లో ఏటా రూ.600 కోట్ల పంట ఉత్పత్తుల విక్రయాలు జరుగుతున్నాయి. ఎమ్మిగనూరు, కోడుమూరు, మంత్రాలయం, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాలు, పక్కనున్న అనంతపురం జిల్లాతోపాటు తుంగభద్ర నదిపై వంతెనలు పూర్తి కావడంతో సరిహద్దు ప్రాంతంలోని తెలంగాణ నుంచి కూడా రైతులు ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెటుకు ఏడాదికి 7 లక్షల బస్తాల దిగుబడులు అమ్మకానికి తీసుకువస్తున్నారు.

మార్కెట్లో 85 మంది కమీషన్ ఏజెంట్లు ఉన్నారు. రైతులు పంట దిగుబడులు విక్రయించిన తర్వాత తక్‌పట్టీ ఇచ్చి రూ.100కు రూ.2 చొప్పున కమీషన్ తీసుకోవాలి. సరకు కొనుగోలు చేసిన తర్వాత రెండు శాతం కమీషన్ పోగా మిగిలిన సొమ్మును రైతు ఖాతాలో జమ చేయాలి. తమ వద్ద నగదు అందుబాటు లేక కొందరు ఇతర కమీషన్ ఏజెంట్ల వద్ద డబ్బులు ఇప్పిస్తున్నారు. ఈ క్రమంలో మరో రెండు శాతం రైతు వద్ద అదనంగా వసూలు చేస్తున్నారు.

మార్కెట్లో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రూ.280 కోట్ల వ్యాపార లావాదేవీలు జరిగాయి. నిబంధనల ప్రకారం కమీషన్ ఏజెంట్లు రెండు శాతం కమీషన్ తీసుకున్నా రూ.12 కోట్లు అవుతుంది. కమీషన్ ఏజెంటు వడ్డీ పేరిట రైతుల నుంచి 2 శాతం వసూలు చేసి తక్‌పట్టీలు ఇచ్చే (నగదు ఇచ్చే కమీషన్ ఏజెంటు)కు ఇస్తారు. ఇలా దాదాపు ఒకరు వ్యాపారం చేసి మరొకరు బిల్లులు పెట్టే వ్యాపారమే రూ.200 కోట్ల వరకు ఉంటుంది. ఈ లెక్కన రైతులపై రూ.4 కోట్ల భారం పడుతోంది.

తాఖీదులిచ్చాం : పద్మావతి, మార్కెట్ కార్యదర్శి

మార్కెట్లో కమీషన్ ఏజెంటు ఒకరికి సరకు వస్తుండగా, మరొక ఏజెంటు బిల్లు పెట్టినట్లు ఫిర్యాదు అందడంతో ఆ కమీషన్ ఏజెంట్ల లైసెన్స్‌ను హోల్డ్‌లో ఉంచాం. ఇలా బిల్లులు పెట్టే కమీషన్ ఏజెంట్లుకు మొదట తాఖీదులు ఇచ్చి తర్వాత లైసెన్స్ రద్దుకు చర్యలు తీసుకుంటాం.

# అక్రమార్కులకు ఉపాధి తాళం

నంద్యాల : ప్రతి నిరుపేద కుటుంబానికి కనీసం వంద రోజుల పని కల్పించాలన్న ఉపాధిహామీ పథకం లక్ష్యాన్ని కొందరు క్షేత్ర సహాయకులు నీరుగారుస్తున్నారు. గత కొన్నేళ్లుగా మండల స్థాయి అధికారులు పీవో లాగిన్‌ను గ్రామస్థాయిలోని క్షేత్ర సహాయకుల చేతిలో పెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇదే అదనుగా వారు ఉపాధిహామీ పథకంలో భారీ అక్రమాలకు తెర తీశారు. దొంగ మస్టర్లు వేశారు. పనులకు రాని వారి పేర్లతో జాబ్‌కార్డులు జారీ చేశారు. చేసిన పనులే మళ్లీ మళ్లీ చేయించి కూలీలు ఇచ్చేశారు. అసలు పనులకు రాని వారి పేరుతో కూలి డబ్బులు విడుదల చేసి గ్రామ నాయకులతో కలిసి పంచుకు న్నారు.ఎంపీడీవోల తప్పిదమే అక్రమాలకు మార్గం

గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకు జాబ్ కార్డుల మస్టర్లు, పని దినాల కల్పన, నూతన పనుల గుర్తింపు తదితర విషయాలు శ్రమతో కూడుకున్నవి కావడంతో ఎంపీడీవోలు నిబంధనలకు విరుద్ధంగా ఆ పనులను క్షేత్ర సహాయకులకు అప్పగించారు. వారు పని తప్పించుకోవడానికి ఇలా చేశారు. దీన్ని అవకాశంగా మార్చుకున్న క్షేత్ర సహాయకులు గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల అండతో పీవో లాగిన్‌ను ఇష్టారాజ్యంగా వాడారు. గ్రామస్థాయిలో అన్నీ తామై వ్యవహరించారు. పీవో లాగిన్‌తో క్షేత్ర సహాయకుకులు జిల్లాలో భారీగా అక్రమాలకు పాల్పడ్డారు. గత ప్రభుత్వ హయాంలో 90 శాతం పంచాయ తీల్లో వైకాపాకు చెందిన వారే సర్పంచులుగా ఉన్నారు. చాలామంది క్షేత్ర సహాయకులు వైకాపా నాయకులతో అంటకాగారు. వారితో కలిసి ఉపాధిహామీ నిధులను పక్కదారి పట్టించారు. లేని కూలీలను సృష్టించి వారి పేరుతో మస్టర్లు వేశారు. నాయకులు, సిబ్బంది కూలీల సొమ్మును వాటాలుగా పంచుకున్నారు. కొత్త కూలీల గుర్తింపు పేరుతో హడావుడి చేసి దొంగ హాజరు వేసి నిధులు స్వాహా చేశారు. క్షేత్రస్థాయిలో జరుగుతు న్న అక్రమాలు ఉన్నతాధికారులకు తెలిసినా మిన్నుకుండిపోయారు.

పని తప్పించుకునేందుకు పన్నాగం

ప్రతి మండలంలో ప్రోగ్రాం అధికారి(పీవో)గా ఎంపీడీవో వ్యవహరిస్తారు. పీవో ఆదేశాలతో ఏపీవోలు, ఎంపీడీవో కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్, సాంకేతిక సహాయకుడు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు మాత్రమే ఉపయోగిస్తారు. పీవో పర్యవేక్షణలో వారు వివరాలు మాత్రమే నమోదు చేయాలి. కాని రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గత కొన్నేళ్లుగా జిల్లాలోని 29 మండలాల్లో పీవోలు లాగిన్‌ను క్షేత్ర సహాయకుల చేతికి అప్పగించడం గమనార్హం.

ఇబ్బడి ముబ్బడిగా జాబ్‌కార్డుల తొలగింపు

నంద్యాల మండలం పుసులూరు గ్రామంలో వైకాపా ప్రభుత్వం హయాంలో నియమించిన క్షేత్ర సహాయకుడు ఇటీవల రాజీనామా చేశారు. వెళ్తూ వెళ్తూ పీవో లాగిన్ తెరిచి నలుగురి జాబ్‌కార్డులను తొలగించారు. వారు తిరిగి పనులకు రాకుండా చేశారు. తన అక్రమాలు బయటపడకుండా చూసుకోవడంతో పాటు పేదలకు ఉపాధి లేకుండా చేశారు. దీంతో అధికారులు గుట్టుచప్పుడు కాకుండా దిద్దుబాటు చర్యలు చేపట్టారు.గోస్పాడు మండలంలో సాంకేతిక సహాయకుడు నిబంధనలకు విరుద్ధంగా ఇదే మండలంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయన గత కొన్నేళ్లుగా ఒక నాయకుని అండతో ఇష్టానుసారం వ్యవహరించారు. మహానంది మండలంలో క్షేత్ర సహాయకునిగా చేస్తున్న ఈయన్ను గత వైకాపా ప్రభుత్వంలో అధికార పార్టీ నేత అండతో పదోన్నతిపై గోస్పాడు మండలానికి బదిలీ చేశారు. ఈయన సొంత మండలంలో విధులు నిర్వహిస్తూ పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామస్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో గత నెలలో ఇతన్ని సస్పెండ్ చేశారు.

ఆళ్లగడ్డ మండలం బత్తలూరు గ్రామంతో పాటు లింగందిన్నె, చిన్నకందుకూరు గ్రామాల్లో కూడా తప్పుడు మస్టర్లు వేసి నిధులు స్వాహా చేశారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి.

